క్లుప్తంగా

మెరుగైన విద్య అందించడమే లక్ష్యం


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

ఎటపాక: గోళ్లగట్ట ప్రాథమిక పాఠశాలను గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకట్రామిరెడ్డి శనివారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్రంలో పేద విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తూ మంచి పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు వచ్చి, విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని కోరారు. సర్పంచ్ గుండి సీతాలక్ష్మి, ఉప సర్పంచ్ శశికుమార్, సచివాలయ కన్వీనర్లు నర్సింహారావు, సురేష్, రాము, కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉన్నారు.

సెల్ టవర్ నిర్మాణానికి చర్యలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ సంతోష్‌కుమార్

డుంబ్రిగుడ: కంద్రుం పంచాయతీ ఒంబి గ్రామానికి సెల్ టవర్ మంజూరైంది. అయితే గ్రామస్తులు టవర్ ఏర్పాటుకు నిరాకరించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సంతోష్‌కుమార్ గ్రామాన్ని శనివారం సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడారు. సెల్ టవర్ ఆవశ్యకత, ఉపయోగాలను వివరించారు. దీంతో గ్రామస్తులు సెల్‌టవర్ కోసం స్థలం ఇచ్చేందుకు అంగీకరించారు. జియో టవర్ ఏర్పాటుకు ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, సర్పంచ్ హరి, నాయకులు దాసు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నేతలు

అరకులోయ రూరల్: మండల పార్టీ అధ్యక్షుడు కొర్రా గాసి కుమార్తె కొర్రా కౌసల్య గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడతూ విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమచారం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శనివారం పార్టీ శ్రేణులతో కలిసి ఆస్పత్రిలో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు, ఎటువంటి అవసరమైన తననుసంప్రదించాలని కోరారు, అక్కడ వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వైస్ ఎంపీపీ సుమాంజలి, ఏఎంసీ చైర్మన్ రాజారమేష్, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, నాయకులు సూర్యనారాయణ, కొండలరావు, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


రాజేంద్రపాలెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ తిరుమలరావు

కొయ్యూరు: పోలింగ్ కేంద్రాలను పరిశీలించి లోపాలు ఉండే వాటిని నమోదు చేస్తున్నామని తహసీల్దారు తిరుమలరావు అన్నారు. రాజేంద్రపాలెంలో 73, 74 నంబర్ల పోలింగ్ కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. విద్యుత్ లేదా ఇతర సౌకర్యాలు లేకుంటే వాటిని సమకూర్చే విధంగా చూస్తున్నామన్నారు. ఒకవేళ భవనాలు పూర్తిగా పాడైతే ఆయా వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. జాబితాలో ఓటర్లు తమ వివరాలను పరిశీలించుకోవాలన్నారు.

అందుబాటులో ఎరువులు

ముంచంగిపుట్టు: బంగారుమెట్ట గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో రాయితీపై ఎరువులను ఎంపీటీసీ సభ్యురాలు కొండమ్మ స్థానిక రైతులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ బంగారుమెట్ట ఆర్‌బీకేలో 50 కేజీల డీఏపీ బస్తా రూ.1365, యూరియా 40 కేజీల బస్తా రూ.275 అందిస్తున్నట్టు చెప్పారు. అవసరమైన రైతులు ఆధార్ కార్డు, 1బి జెరాక్స్‌లు అందించి పొందవచ్చన్నారు. నాయకులు జగన్నాథం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సుపరిపాలన దేశానికే ఆదర్శం

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి


తోటకూరపాలెంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

వై.రామవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని చవిటిదిబ్బలు సచివాలయం పరిధిలోని తోటకూరపాలెం, పూతిగుంట గ్రామాల్లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శనివారం రాత్రి గం.9 గంటల వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం జగనన్నదేనన్నారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో సుమారు 130 గడపలను సందర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుంటు, ఇప్పటివరకు ప్రభుత్వం అందించిన పథకాలను తెలియజేశారు. అర్హులందరికీ ప్రతీ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. గ్రామాల్లోని సమస్యలను తక్షణమే పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.గత ప్రభుత్వంలో ఎన్నడూ చేయని అభివృద్ధిని జగనన్న ప్రభుత్వం చేస్తోందన్నారు. పార్టీలకతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు అండగా ఉండి ప్రభుత్వాన్నే గెలిపించుకుందామన్నారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు వలాల విశ్వమ్మ, ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ బచ్చలి చిన్నమ్ములు, మండల పార్టీ కన్వీనర్ మామిడి అప్పారావు, సర్పంచ్‌లు, జిల్లా కార్యదర్శి గుడ్ల త్రిమూర్తులు, సచివాలయ మండల కన్వీనర్ కరణం కనకరాజు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ మధుసూధన రాజు, ఏపీవో ప్రకాష్ బాబు, పంచాయతీ కార్యదర్శి ఎస్‌కె రజియా, నాయకులు నారాయణరావు, భారతిబాబు, విజయ్‌కుమార్, నూకరాజు, శ్రీను పాల్గొన్నారు.

బాధితులకు అండగా ప్రభుత్వం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాడియం గోపాల్

వీఆర్ పురం: మండల కేంద్రంలోని సచివాలయం భవనం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులతో మండల పార్టీ కన్వీనర్ పాడియం గోపాల్ శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరద బాధితులందరికీ ప్రభుత్వం సాయం చేస్తోందన్నారు. మ్యాపింగ్‌లో లేని కుటుంబాలకు సైతం రూ.2వేల నగదు, నిత్యావసర సరకులను పంపిణీ చేస్తోందన్నారు. వరద బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. బాధితులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ బి.సత్యనారాయణ, సర్పంచ్ పి.రామారావు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానీటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, నాయకులు సత్తిబాబు, గౌతమ్, సచివాలయ కన్వీనర్లు శ్రీధర్, కాంతారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

జి.మాడుగుల: మండలంలోని బదిలీ అయిన ఉపాధ్యాయులు, పదోన్నతులు పొందిన, రెండవ ఎంఈవోలకు జీతాలు చెల్లించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తహసీల్దార్ అప్పలస్వామికి పలువురు వినతిపత్రం అందజేశారు.

హుకుంపేట: ఉపాధ్యాయులు బకాయి జీతాలు ఇవ్వాలని కోరుతూ మండల కేంద్రంలో ఏపీటీఎఫ్ నేతలు తదితరులు తహసీల్దార్ కార్యాలయంలోని సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

ఉపాధ్యాయుడిని నియమించాలి

సీలేరు: దారాకొండ పంచాయతీ కమ్మరితోట గ్రామంలో ఉపాధ్యాయుని నియమించాలని స్థానికులు కోరారు.జీపీఎస్ టిడబ్ల్యూ స్కూల్ గ్రామంలో ఉందని, ఉపాధ్యాయుడుని ఇటీవల బదిలీ చేశారని అప్పటి నుండి ఉన్న ఒక్క ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులకు చదువు చెప్పేవారు లేక పాఠశాలకు వెళ్లడం లేదని మరి కొందరు పొలం పనులకు వెళ్లిపోతున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు.

డ్రాపౌట్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ


బాలికతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆశాజ్యోతి

చింతపల్లిరూరల్: కొమ్మంగిలోని ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో ఆశాజ్యోతి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రాపౌట్ విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. బడిఈడు పిల్లలను పాఠశాలలకు తల్లిదండ్రులు పంపాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి, మంచి మార్కులు సాధించేలా చూడాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆమె సరుకులను గర్భిణులకు,బాలింతలకు నిర్ణీత సమయంలో అందజేయాలన్నారు. ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

9న ఆదివాసీ దినోత్సవం

రంపచోడవరం: ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 9న పాఠశాలల్లో ఆకుపచ్చ జెండా ఆవిష్కరించాలని ఆదివాసీ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొండ్ల వర ప్రసాదరావు కోరారు. మండల, డివిజన్ ప్రధాన కేంద్రాల్లో సంస్కృతి, సంప్రదాయాలతో ఘనంగా జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పరిహారానికి వినతి

ఎటపాక: వరద ముంపు బాధితులను ఆదుకోవాలని, నష్టపరిహారం అందజేయాలని నెల్లిపాకలో పలువురు శనివారం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వర్షాల వల్ల ఉపాధి కరువైందని, ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పేదలందరికీ పరిహారం ఇవ్వాలని కోరుతూ సచివాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. నాయకులు రాము, వెంకన్న పాల్గొన్నారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో పూర్ణయ్య

పెదబయలు: మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయం సిబ్బందితో ఎంపీడీవో ఎల్. పూర్ణయ్య శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ కమీషన్ ఉత్తర్వుల ప్రకారం ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు విజయవంతం చేయాలన్నారు. ఇందులో భాగంగా నా భూమి నా దేశం, నేల తల్లికి సమస్కారం, వీరులకు వందనం అనే కార్యాక్రమాలు ఈ నెల 9 నుంచి 15 వరకు నిర్వహించాలన్నారు. 9న అమరవీరుల సంస్మరణ సభలు, 10న పంచ ప్రాణ ప్రతిష్ఠ, 11న వసుదకు వందనం, 14న వీరులకు వందనం, 15 జాతీయ జెండా ఆవిష్కరణ తదితర కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రోజు వారీ కార్యక్రమాలు తప్పకుండా చేయాలని ఆదేశించారు. ఈవోఆర్‌డి నర్సింగరావు, ఉపాధి సిబ్బంది. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

పాడేరు రూరల్ : పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి మొదటి విడత అడ్మిషన్లు ప్రారంభమైనట్టు ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడత ఆన్‌లైన్ సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 5,6,7 తేదిల్లో కళాశాలకు నేరుగా వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకొని అడ్మిషన్లు పొందాలన్నారు.

శనివారం 23 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు స్పష్టం చేశారు.

వరద బాధితులకు నిత్యావసరాలు


వరద బాధితులకు నిత్యావసరాలు, దుస్తులు అందజేస్తున్న ఆదివాసీ సంరక్షణ సమితి సభ్యులు

కూనవరం: ప్రభుత్వం అందించే వరద సాయంతో పాటు బాధితులకు సహాయ సాకారం అందించేందుకు దాతలు ముందుకు రావాలని జాతీయ ఆదివాసీ సంరక్షణ సమితి జాతీయ కన్వీనర్ సీతారామన్న దొర అన్నారు. మండల పరిధిలోని లింగాపురం పంచాయతీ తాళ్లగొమ్ములో సుమారు 60 కుటుంబాలకు శనివారం బియ్యం, నిత్యావసరాలు, దుస్తులు పంపిణి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కారం గంగాధర్ రావు, అర్రెం ప్రశాంత్, కాక శివశంకర్ ప్రసాద్, సోడె మధుసూధన్, వీరభద్రం, బొగ్గా బాయమ్మ, జెట్టి కన్నారావు పాల్గొన్నారు.

9న మహాధర్నా



మాట్లాడుతున్న సీఐటీయూ నేత కోటేశ్వరరావు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 9న మహాధర్నా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమం అమలులో తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. కార్మికుల హక్కులు, చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. దీనిపై ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికు సంఘాలు ఉద్యమించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వైఫల్యంతో కార్మిక చట్టాలు, హక్కులు అమలు కావడం లేదన్నారు, అసంఘిటిత కార్మికులకు కనీస భద్రత లేదని, అన్ని వర్గాల ప్రజలు ఏకమై కేంద్రంపై వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరావు, నాయకులు సన్నిబాబు, పోతురాజు, భగత్‌రాం తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ముఖ గుర్తింపు ప్రక్రియ ప్రారంభం


ముఖ గుర్తింపు యాప్‌పై వర్కర్‌కు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో, సూపర్‌వైజర్

కొయ్యూరు: మండలంలో ఉన్న 804 మంది బాలింతలు, గర్భిణులకు ఇంటికే రేషన్ తీసుకెళ్లే విధానంలో భాగంగా ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నిజేషన్) ప్రక్రియను చేపట్టామని సీడీపీవో విజయకుమారి తెలిపారు. ఇందులో భాగంగా ప్రతీ లబ్ధిదారుని ముఖ గుర్తింపును విధిగా తీసుకుంటామన్నారు. ఆమె శనివారం బాలారంలో లబ్ధిదారులతో మాట్లాడారు. వర్కర్లు ఫేషియల్ రికగ్నిజేషన్ విధానాన్ని వివరించారు. ప్రతీ నెల లబ్ధిదారులకు సరకులు ఇచ్చే సమయంలో వారి ఎఫ్‌ఆర్‌సీని నమోదు చేస్తామన్నారు.ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కోళ్ల పెంపకంతో లాభాలు


లబ్ధిదారులకు కోడి పిల్లలను అందజేస్తున్న వాసన్ సంస్థ ప్రతినిధులు

డుంబ్రిగూడ: మండలంలోని సొవ్వ పంచాయతీ కొట్రగొంది గ్రామంలో శనివారం జరిగిన కార్యక్రమంల్లో వాసన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు స్థానిక గ్రామస్తులకు నాటు కోడి పిల్లలను అందజేశారు. వారు మాట్లాడుతూ నాటుకోళ్ల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. నాటకోళ్ల ఫారం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వెటర్నరీ సిబ్బంది సంజీవరావు, సంస్థ ప్రతినిధులు పరుశురాం, రఘునాథ్, కామరాజు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి


మాట్లాడుతున్న ఏపీఎం శ్రీనివాస్

కొయ్యూరు: ఆర్థిక నిర్వాహణపై ఏపీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో 50 మంది మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రుణాలు తీసుకున్న మహిళలు స్వయం ఉపాధితో వారి జీవనోపాధి మెరుగుపరుచుకోవాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి పొందవచ్చన్నారు. పుస్తక నిర్వాహణపై కూడా అవగాహన కల్పించారు. ఖర్చులను తగ్గించుకోవాలని సూచించారు. తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని కోరారు. టీవోటీలు నాగేశ్వరరావు, మీనాక్షి, హెచ్‌డీ సీసీ ప్రసాద్, సీసీ చిన్నభాయ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


రంపచోడవరంలోని ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్, అంగన్‌వాడీ కార్యకర్తలు


వై.రామవరంలో పోషకాహార కిట్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

రంపచోడవరం: అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోని ఆరోగ్యం ఉండాలని పెదగెద్దాడ సర్పంచ్ వడగల ప్రసాద్‌బాబు అన్నారు. పెదగెద్దాడ పంచాయతీ పరిధిలోని చెరువుపాలెం గ్రామంలో గర్భిణి, బాలింతలకు టెక్‌హోం రేషన్‌ను అందజేశారు. ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత నివారణకు అంగన్‌వాడీ ద్వారా గతంలో కంటే మెరుగైన పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. టెక్‌హోం రేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.గెద్దాడలో జరిగిన తల్లిపాల వారోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. వైఎస్సార్ నాయకులు రాయరపు బుల్లబ్బాయి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కుసుమ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేశారు. సర్పంచ్ బాలురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నారాయణ రావు, ఈఓపీఆర్‌డి మధుసూధనరాజు, అంగన్‌వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డులు


సమావేశంలో మాట్లాడుతున్న వైస్ సర్పంచ్ వీరబాబు

మారేడుమిల్లి: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని పాఠశాల సిబ్బంది శనివారం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సత్యవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ సార్ల లలిత కుమారి, సర్పంచ్ కొండ జాకబ్, వైస్ సర్పంచ్ బొడ్డేటి వీరబాబు తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా 2022-23 సంవత్సరం పదో పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణులలో ప్రతిభ కనబరిచిన పి.శివకృష్ణ తిరుపతి రెడ్డి, కత్తుల సాయి కిరణ్ రెడ్డి, తుంబుడు జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు రూ.6వేల నగదు, మెడల్స్, ప్రశంసాపత్రలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోవ తరగతి ప్రతి విద్యార్థికి పునాది వంటిదని, మంచి ఫలితాలు సాధించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), మాజీ కో-ఆప్షన్ సభ్యుడు బులసుమిల్లి చంటి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం


మృతుల కుటుంబాలకు నిత్యావసర సరకులు, నగదు అందజేస్తున్న నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని రంగబయలు పంచాయతీ పట్నపడాల్‌పుట్టు గ్రామానికి చెందిన సీసా కామేష్, సీసా జినబంధులు చేపల పేటకు వెళ్లి గత నెల మృత్యువాత పడ్డారు. ఈ మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆదేశాల మేరకు ఆమె భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు జల్లిపల్లి మూర్తి, సీనియర్ నేత అరబీరు జగబంధులు శనివారం పట్నపడాల్‌పుట్టు గ్రామానికి వెళ్లి మృతుల కటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు ఆర్థిక సాయమందించారు. వైస్ ఎంపీపీ భాగ్యవతి, మాకవరం సర్పంచ్ గంగాధర్, వలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు దేవా, రంగబయలు మాజీ సర్పంచ్ శ్రీను, వనుగుమ్మ వైస్ సర్పంచ్ సీతారాం, సచివాలయ కన్వీనర్లు రాంప్రసాద్, ప్రసాద్, నేతలు రామరాజు, కళ్యాణం, సీతారాం, రాము, జిన్ను గ్రామస్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

అరకులోయ రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాడగడ పంచాయతీ సర్పంచ్ జ్యోతి తెలిపారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో పర్యటించి, ప్రజలకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కొద్ది రోజులగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తాగునీరు కలుషితమయ్యే అవకాశముందని, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని వినియోగించాలని సూచించారు. సచివాలయం, వైద్యశాఖ సిబ్బంది గ్రామ వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులు సమన్వయంగా గ్రామల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలకు చైతన్యం కల్పించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు

చింతపల్లిరూరల్: సీజనల్ వ్యాధులు నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్టు ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్ తెలిపారు. మండలం కేంద్రంలో ఆయన శనివారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. దోమల వలన కలిగే వ్యాధులు నివారణపై స్థానికులకు అవగాహన కల్పించారు. దోమల నివారణ మందు పిచికారీ పనులు చేయించారు. ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాపించడానికి ముఖ్య కారణం దోమలు అని అన్నారు. నీటి నిల్వలు లేకుండా చూడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహా భారతంపై పోటీలు

అనకాపల్లి రూరల్: మహా భారతంపై విద్యార్థులకు ఈ నెల 20న వ్యాసరచన, 27న వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు తెలుగు భాషా పరిరక్షణ సమితి సమన్వయకర్త కొయిలాడ రామ్మోహన్‌రావు,సహ సమన్వయకర్త జి.రంగబాబు తెలిపారు.పట్టణంలోని రింగురోడ్డు హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న ఈ పోటీలు సబ్ జూనియర్,జూనియర్, సీనియర్ విభాగాల్లో ఉంటాయన్నారు.

వ్యాసరచన పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మాత్రమే వక్తృత్వ పోటీలో పాల్గొనేందుకు అనుమతిస్తామని తెలిపారు. రాంకీ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ పోటీ ల్లో విజేతలకు ఈ నెల29న వివేకానంద ఫంక్షన్ హాలులో బహుమతులు అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 9849345060, 9182873598, 9550234204 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

నేడు ఏఎంఏఎల్ పూర్వ విద్యార్థుల కలయిక

అనకాపల్లిటౌన్: స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో బీఎస్సీ చదివిన(1963-66 బ్యాచ్) పూర్వ విద్యార్థులు స్నేహితుల దినోత్సవాన్ని పురస్క రించుకుని ఆదివారం గాజువాకలో సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడి, వివిధ హోదాల్లో పనిచేసి పదవీవిరమణ పొందిన స్నేహితులందరూ కలుసుకోనున్నారు.

రేపు చేనేత దినోత్సవం

అనకాపల్లిటౌన్: స్థానిక గాంధీనగరం సచివాలయం మేడపై సోమవారం చేనేత దినోత్సవం నిర్వహించనున్నట్టు చేనేత కో ఆర్డినేటర్ సూరిశెట్టి సూరిబాబు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి చేనేత వృత్తిదారులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.